# ఆఫీస్ ఫోబియా

కొందరికి బల్లులంటే భయం. కొందరికి పిల్లులంటే భయం. కొందరికి ఒంటరిగా ఉండాలంటే భయం. కొందరికి పదిమందిలోకి రావాలంటే భయం. చీకటంటే భయం, నీళ్ళంటే భయం, నిప్పంటే భయం – ఇలా భయాలు వెయ్యి రకాలు. దీన్ని మనస్తత్వ శాస్త్రజ్ఞులు 'ఫోబియా' అంటారుట. అందరికీ నవ్వులాటగా ఉన్నా ఆ ఫోబియా ఉన్నవాడి భయం వాడికే తెలుస్తుంది.

మా హనుమాన్లుకి ఈ మధ్య అటువంటి ఫోబియా ఒకటి – ఆఫీస్ ఫోబియా– పట్టుకుంది. కిందటి సంవత్సరం వాడి ఫాదర్ పోయారు. ఆయన పేరన కొంత డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండిపోయింది. ఆయన మరణించిన విషయం తెలియజేస్తూ ఆ డబ్బు నామినీ అయిన తన పేరున ట్రాన్స్‌ఫర్ చెయ్యమని దరఖాస్తు పెట్టుకున్నాడు వాడు.

దానితో కథ మొదలైంది.

'అయ్యా – మీరు మరణించినట్లు తెలిసి మేము చాలా విచారించితిమి. మీరు కోరిన విధముగా మీ పేరు మా రికార్డుల నుంచి తొలగించడమైనది....' అంటూ వారం రోజుల్లో జవాబు వచ్చింది.

'అయ్యా – మరణించినది నేను కాదు – మా తండ్రిగారు. నేను జీవించియే యున్నాను. ముందు ఉత్తరములో కోరినట్లుగా మరణించిన మా తండ్రిగారు పేరు మీ రికార్డుల నుంచి తొలగించి జీవించియున్న నా పేరు నమోదు చెయ్యవలసినదని కోరుచున్నాను...' అని వెంటనే జవాబు రాశాడు హనుమాన్లు.

పదిహేను రోజుల్లో జవాబు వచ్చింది – 'అయ్యా – మీరు మరణించలేదనియు, జీవించియే యున్నారనియు మీ ఉత్తరము ద్వారా తెలిసి మేము చాలా సంతోషించితిమి.

అయినను మా రికార్డులలో మీరు మరణించి యున్నారు. కావున మీ పేరు నమోదు చేయలేమని తెలియజేయుటకు మిక్కిలి చింతించుచున్నాము. మీరు జీవించియే యున్నట్లు ధ్రువపత్రము పంపినచో మా రికార్డు సరిచెయ్యగలము....'

వాడు బతికున్నట్లు సర్టిఫికేట్ తీసుకోవడానికి ఇంకో ఆఫీసుకు వెళ్ళాల్సి వచ్చింది.

వాడు ఆఫీసులోకి వెళ్ళబోతుంటే గుమ్మం దగ్గర స్టూలు మీద, సర్కసులో కోతిలా కూర్చున్న ప్యూను వాడిని ఆపుచేసి, 'నీ పనయిపోయింది' అన్నాడు నవ్వుతూ.

'నా పనైపోవడవేవిటి? నేనిదే రావడం'.

'నిన్ను చూసి ఇంకోళ్ళనుకుని పొరబడ్డా కావాల! నీ పనయిపోతుంది' అన్నాడు మళ్ళీ నవ్వుతూ.

గవర్నమెంటాఫీసుల్లో నవ్వులకీ, చిటపటలకీ వేరే అర్థాలుంటాయని తెలియని హనుమాన్లు సమాధానంగా తనూ నవ్వాడు.

ప్యూను మళ్ళీ నవ్వాడు – 'ఆఫీసుకురావడం కొత్తనుకుంటాను'.

'కొత్తే'.

'ఫర్వాలేదు – పనయిపోతుంది' అని మళ్ళీ నవ్వాడు.

వాడి నవ్వుకి అర్థం తెలియక తన వంతుగా హనుమాన్లు ఇంకోసారి నవ్వాడు. కొంచెం సేపు ఇద్దరూ దంత సౌందర్యం ప్రదర్శించాకా వాడినొక గెంటుగెంటి లోపలకు వెళ్ళాడు హనుమాన్లు.

అక్కడ ఎలుగుబంటిలాంటి సూపర్నెంటుగారొకరు, కుర్చీకే కాక గదికే నిండుదనం ఇచ్చేలా కూర్చుని ఉన్నారు. ఆయనకి అప్లికేషను ఇచ్చి ఎదురుగా కూర్చున్నాడు మనవాడు. ఆయన కళ్ళజోడు సర్దుకుని, జాగ్రత్తగా అప్లికేషను చదివి, మనవాడినోసారి పరిశీలనగా చూసి, పాదాలకేసి ప్రత్యేకంగా చూసి, 'నువ్వు బతికున్నావు. అలా అని సర్టిఫికెట్ కావాలన్నమాట,' అన్నాడు టేబులుమీద మద్దెల వాయిస్తూ.

'అవును సార్'

'ఆయబ్బాయికి కొత్త' అన్నాడు గుమ్మందగ్గర ప్యూను నవ్వుతూ.

'మన వ్యాఘ్రేశ్వరుడు చూసుకుంటాడులే' అని, 'వ్యాఘ్రం! ఈ అబ్బాయికేదో సర్టిఫికేట్ కావాలట – చూడు' అని వ్యాఘ్రేశ్వరుడికి అప్లికేషను ఇమ్మని చెయ్యి ఊపాడు సూపర్నెంటు.

హనుమాన్లు వ్యాఘ్రం దగ్గరకు వెళ్ళి అయిదు నిమిషాలు నుంచున్నా అది ఉలకలేదు, పలకలేదు, తలెత్తి చూడలేదు. వాడు కొంచెం దగ్గి, వ్యాఘ్రేశ్వరుడి కళ్ళకు కనబడేలా, ఎదురుగా అప్లికేషను టేబులు మీద ఉంచాడు.

'పని చేసుకుంటుంటే డిస్టర్బు చెయ్యకు – టేకిటాఫ్' అని ఒక సారి గాండ్రించి, వాడి అప్లికేషను పక్కకు గెంటి, దాని మీద పేపరు వెయిట్‌తో ఓ మొట్టికాయ మొట్టింది వ్యాఘ్రం.

ఆ గాండ్రింపుకి హనుమాన్లు గజగజలాడినా అవసరం వాడిది కాబట్టి ధైర్యం తెచ్చుకుని, 'సర్టిఫికెట్ ఇవాళిస్తారా?' అనడిగాడు.

వ్యాఘ్రం గుర్రుగుర్రుమంది కాని మాట్లాడలేదు.

'కొంచెం అర్జెంటు – సాయంకాలం మళ్ళీ రమ్మంటారా?'

'నన్ను డిస్టర్బు చెయ్యొద్దన్నాను కదా! దుర్... దుర్....'

మరి లాభంలేదని, మళ్ళీ సూపర్నెంటుగారి దగ్గర కెళ్ళి, 'నేను బతికున్నట్లు సర్టిఫికెట్ ఇవాళే ఇస్తే సంతోషిస్తా సార్' అన్నాడు మనవాడు వినయంగా.

'అప్లికేషన్ ఇచ్చావా?'

'ఇప్పుడే కదా ఇచ్చాను సార్?' అన్నాడు మనవాడు తెల్లబోయి.

'ఇప్పుడే ఇచ్చి ఇప్పుడే సర్టిఫికెట్ కావాలంటే ఎలా వస్తుందయ్యా! గర్భాదానం నాడే పిల్లాడు కావాలంటే ఎలా?'

అక్కడున్న వాళ్ళంతా గొల్లున నవ్వారు. హాలులో కొంచెం దూరంగా కూర్చున్న ఆడవాళ్ళు ఒక పక్కకు తిరిగి ముసి ముసి నవ్వులు నవ్వారు.

'రేపు రమ్మంటారా?' అన్నాడు హనుమాన్లు నీరసంగా.

'మళ్ళీ రేపంటాడు? కిందా మీదా తంటాలు పడాలి. తొమ్మిది నెల్లు ఆగాలి.... నే చెప్పేదాంట్లో తప్పేవైనా ఉంటే చెప్పు... నువ్వు చిన్న వాడివైనా లెంపలేసుకుని ఒప్పుకుంటాను. నే చెప్పేది రైటేనా?'

'రైటే సార్'

'మరైతే రేపే కావాలంటే ఎలారా నాయనా?'

'అయబ్బాయికంతా కొత్త. కంగారు పెట్టేస్తే ఎలా?' – అంది స్టూలు మీది కోతి సానుభూతి చూపిస్తూ.

'కంగారా? ఈ కాలం కుర్రాళ్ళు కంగారు పడతారా? నిక్కరు కట్టుకోడం రాదుగాని వాత్స్యాయన కామసూత్రాలు టకటక అప్పచెప్పేసి నీకూ నాకూ పాఠాలు చెబుతారురా నారాయణా' అంది ఎలుగుబంటి.

అంతా మళ్ళీ గొల్లున నవ్వారు.

వాడన్నదానికీ, ఆయన అంటున్నదానికీ సంబంధమేవిటో హనుమాన్లుకి అర్థం కాలేదు. వాడికేం చెయ్యాలో తోచలేదు. జూకి వెడితే అక్కడి జంతువులన్నీ ఆటపట్టిస్తున్నట్లు అనిపించింది మనవాడికి. ఎవరినైనా పలకరించడానికి భయపడుతూ కొంచెం సేపు కూర్చుని, ఎవరి పనుల్లో వాళ్ళు మునిగి ఉండగా చెప్పా పెట్టకుండా బయటికి జారుకున్నాడు, రుమాలుతో మొహం తుడుచుకుంటూ.

నాలుగైదు రోజులు పోయిన తర్వాత మళ్ళీ ఆఫీసుకి వెళ్ళాడు – పని వాడిది కదా!

'ఏంటి? ఎక్కడికల్లా తిన్నగా హోటల్లోకెళ్లినట్టెల్లి పోతున్నావు?' – నారాయణ గుమ్మం దగ్గర అటకాయించాడు.

'పెసరట్టు తిందామని' అన్నాడు హనుమాన్లు పెంకెగా.

'ఆ పెసరట్టు నేను తినిపిస్తాగాని ఈయాల లోపల ఇనస్పెక్షను జరుగుతోంది. పబ్లిక్ డీలింగులు లేవు. బయటికి దయచెయ్యి' అన్నాడు నారాయణ పొగరుమోత్తనంగా.

'ఎప్పటిదాకా ఇనస్పెక్షన్?'

'ఆఫీసరుగారు చేసినంతవరకూ'

'ఎంతవరకూ చేస్తారు?'

'ఆయనిష్టవైనంతవరకూ'

'మళ్ళీ వారం వస్తా' అని వాడికి టాటా చెప్పి, వారం పదిరోజులు పోయాకా మళ్ళీ వెళ్ళాడు హనుమాన్లు. బతికున్నానని రుజువు చేసుకోడానికి ఎన్ని అవస్థలు పడాల్సి వస్తోందిరా అని నవ్వూ, ఏడుపూ వచ్చింది వాడికి.

నెలరోజుల తర్వాత 'పుటప్' చేశావన్నారు.

రెండో నెలలో ఆఫీసరు గారు 'క్వొరీ' వేశారు.

మూడోనెలలో మళ్ళీ పుటప్ చేశారు కాని ఆఫీసరు గారు టూరులో వెళ్ళారు – సంతకం చెయ్యలేదు.

నాలుగో నెలలో మళ్ళీ పుటప్ చేశారు కాని ఫైలు కనిపించడం లేదు.

'ఏరా నారాయణా! ఈయనగారి ఫైలు చూశావా?' అన్నారు సూపర్నెంటుగారు.

'నాకేం గుర్తు? ఆ రూంలో ఫైళ్ళు ఈ రూంలోనూ, ఈ రూంలో ఫైళ్ళూ ఆ రూంలోనూ పడేయడం తప్ప నాకేం తెలుస్తుంది?'

'పోనీ ఆఫీసరుగారి రూంలో ఏవైనా ఉందేమో చూడరా బాబూ - పాపం ఈయనకి అర్జెంటుగా సర్టిఫికేట్ కావాలిట....'

'ఆయన బల్లమీద కాగితం ముక్క లేదు - ఖాళీ ప్లేటులా ఉంది' అన్నాడు నారాయణ హనుమాన్లుకి పెసరట్టు గుర్తు చేస్తూ.

'వ్యాఘ్రంని అడిగి చూడు' సలహా ఇచ్చారు సూపర్నెంటుగారు.

'సార్ - నా ఫైలొచ్చిందా?' - భయపడుతూ, భయపడుతూ అడిగాడు హనుమాన్లు.

'ఎక్కణ్ణుంచి రావడం?' వ్యాఘ్రం శాంతంగా అడిగింది.

'ఆఫీసరు గారి దగ్గర్నుంచి'

'ఆయనెప్పుడు పంపించాడు?' - పరమశాంతంగా వచ్చింది ప్రశ్న.

'తెలియదు'

'తెలియకపోతే.... నన్ను డిస్టర్బ్ చెయ్యకు.... డైరీ నంబరు, డేటూ కనుక్కురా'- గాండ్రు గాండ్రుమంది వ్యాఘ్రం, తలుపులు, కిటికీలు అన్నీ వణికేలా.

వీడికెప్పుడు కోపం వస్తుందో, ఎప్పుడు శాంతంగా ఉంటాడో, వీణ్ణి పుట్టించిన దేవుడికైనా తెలియదురా బాబూ అనుకున్నాడు. ఆ డైరీ నంబరేమిటో, డేటేవిటో, ఎక్కడ కనుక్కోవాలో అర్థంకాలేదు. ఎవర్ని అడగాలో తెలియలేదు.

ఇదంతా చూసి మనవాడికి మండుకొచ్చి తిన్నగా ఆఫీసరుగారి రూంలోకి వెళ్ళిపోయాడు అంతా చూస్తుండగా.

'నువ్వు బతికే ఉన్నావా?' - అన్నారు ఆయన, అంతా సానుభూతిగా విని.

'అలాగే అనిపిస్తోంది సార్'

ఆయన బెల్లు కొట్టి సూపర్నెంటుగారిని పిలిచారు -'వాటీజిట్టండీ - ఈ కుర్రాడి గొడవేవిటి? బతికే ఉన్నానంటున్నాడు కదా'

సూపర్నెంటుగారికీ అలాగే అనిపిస్తోందిట కాని 'రూల్సు ఫాలో అవాలి కదా' అన్నారు.

'ఫాలో అవండి. సొంత ప్రాణాలవునో కాదో వెరిఫై చేయించారా?'

'చేయించాం'

'మరింక – వాటీజ్ అబ్జక్షనండీ?'

'ఫైలు కనిపించడం లేదు' అన్నారు సూపర్నెంటుగారు, తాపీగా వెనక్కు జార్లపడి.

మరో అప్లికేషను ఇవ్వమన్నారు ఆఫీసరుగారు. కొత్త అప్లికేషను ఇచ్చాడు హనుమాన్లు. నెల రోజుల్లో సర్టిఫికేట్ ఇంటి అడ్రసుకు రిజిష్టర్డు పోస్టులో వచ్చి చేరింది. హనుమాన్లు విజయగర్వంతో కాలరెగరేశాడు. మన తడాఖా తెలిసింది వీళ్ళకి, ఇంటికి పంపించారు, అని సంతోషించాడు. తొమ్మిది నెలలు ఆలస్యమైనా సర్టిఫికేట్ సంపాదించగలిగాడు కదా!

మర్నాడు మొదటి ఆఫీసుకు వెళ్ళి సర్టిఫికేట్ ఇచ్చి డిపాజిట్టు తన పేర ట్రాన్స్ఫర్ చెయ్యమని అడిగాడు.

ఆ సూపర్నెంటుగారు ఎలుగుబంటిలా లేరు. ఏభై రోజులుగా నిరాహార దీక్షలో ఉన్న ఎండు నక్కలా ఉన్నారు. వాణ్ణి కూర్చోబెట్టి, వాడి ఫైలు తెప్పించి చూసి, కళ్ళు చిట్లించి, చెయ్యి జాపి, కళ్ళకు మూడడుగుల దూరంలో ఆ కాగితం ఉంచి చదివి, 'ప్చ్.... ప్చ్....' అని, కళ్ళజోడు తీసి, కళ్ళకు మూడంగుళాల దూరంలో ఉంచి ఇంకోసారి చదివి, 'ప్చ్.... ప్చ్...' అని మళ్ళీ అని, 'ఇది పనికిరాదు నాయనా' అన్నారు.

హనుమాన్లు గుండె జారిపోయింది.

'ఎందుకు పనికి రాదు సార్?'

'ఇందులో నువ్వు జూన్ నుంచి డిసెంబరు వరకూ – ఆరు నెలలు – బతికున్నట్టుంది. మాకు నువ్వు మార్చిలో బతికున్నట్టు సర్టిఫికేట్ కావాలి. అది తీసుకురా. నీ పని వెంటనే అయిపోతుంది' అని ఫైలు ఔట్ ట్రేలో విసిరేసి, వాడి సర్టిఫికేట్ వాడి మొహాన్నేసి కొట్టారు సూపర్నెంటుగారు.

'అంటే – మార్చిలో చచ్చిపోయి, మళ్ళీ జూన్‌లో బతికొచ్చాననంటారా?'

'ఏమో – నాకేం తెల్సు'

'మీరు కొంచెం ఆలోచించండి సార్' అన్నాడు హనుమాన్లు బతిమాలుతూ.

'ఏం? అలా ఎందుకు జరగకూడదూ? వాతాపి కథ తెలుసా? వాడిని చంపేసి, కూరొండేసి, అతిథులకి పెట్టేవాడు వాడి అన్నగారు. అతిథుల పొట్టలోకి వాతాపి వెళ్ళిపోయాకా, వాతాపీ! రా... అంటే వాడు పొట్ట చీల్చుకుని బతికి వచ్చేసేవాడు'

'అది కథ సార్'

'అది కథా? మన పురాణాల్లోనూ, వేదాల్లోనూ చెప్పినవన్నీ కట్టుకథలా? నువ్వు చదివే బోడి ఇంగ్లీషు పుస్తకాలు సత్యాలా? శివుడు విఘ్నేశ్వరుడికి ఏనుగు తల తగిలించాడంటే కట్టు కథానూ, ఏనుగు తల తగిలించడవేవిటి అని వేళాకోళవూనా? అదే మీ డాక్టర్లు గుండెలు, కిడ్నీలు మారిస్తే, 'ఔనండోయ్ - సైన్స్ ఎడ్వాన్సయిందండోయ్' అని గొప్పలా? ఏవిటి ఎడ్వాన్సయింది నా పిండాకూడు. ఇంక వెధవ కబుర్లు చెప్పకు...'

హనుమాన్లు పేలుదామనుకుంటే, వాడి కంటే ముందే ఆయన దుర్వాస మహా మునిలా పేలేటప్పటికి వాడు చల్లారిపోయాడు. తన పిలకకీ, వాడి మోకాలుకీ ముడేసి ఆయన అలా తగవు పెట్టేసరికి ఏం చెయ్యాలో తోచక, ఆయన చెప్పిన పురాణ కథల్లో వసుదేవుడి కథ గుర్తుకు తెచ్చుకుని, ఆయన కాళ్ళు పట్టుకుని, 'మీరు అపార్థం చేసుకున్నారు నన్ను - అటువంటివి జరగవనలేదు' అన్నాడు.

ఆయన శాంతించి, 'ఒప్పుకుంటున్నావా?' అన్నారు.

ఆయన శాంతం చూసి, 'ఎందుకు ఒప్పుకోనూ? అల్లాంటివి జరుగుతాయి సార్' అన్నాడు హనుమాన్లు ఆశగా.

'అయితే వెళ్ళు - వెళ్ళి మాకు కావలసిన కాగితం పట్రా నాయనా' అన్నారు ఆయన శాంతంగా.

ఈ చేదు అనుభవం తర్వాత మనవాడి పరిస్థితి ఎలా తయారైందంటే ఆఫీసు కాంపౌండ్ గేటు దాటుతుండగానే మలేరియా వచ్చిన వాడిలా వణకడం మొదలు పెట్టేవాడు. ఆఫీసు గుమ్మం దగ్గరకి రాగానే, చావబోయేవాడిలా కళ్ళు పెద్దవైపోయేవి. అడుగులు తేలికై అడ్డదిడ్డంగా పడేవి. ఆఫీసరు దగ్గరకు చేరేటప్పటికి స్పృహ తప్పేవాడిలా అయిపోయేవాడు. ఎంత ప్రయత్నించినా నోటమాట వచ్చేదికాదు - అంటే మనవాడు క్లాసిక్ కేస్ ఆఫ్ ఆఫీసు ఫోబియా అయిపోయాడన్నమాట.

ఈ కథంతా చెప్పి 'కథ మళ్ళీ మొదటి కొచ్చిందిరా' అని గొల్లుమన్నాడు వాడు. నేను వాణ్ణి ఓదార్చి, 'కంగారు పడకు - నేను వస్తానులే' అంటూ వాడి కూడా వెళ్ళాను. మనకిలాంటి ఫోబియాలు, గీబియాలు లేవు.

గుమ్మం దగ్గర నారాయణని చూసీ చూడ్డంగానే, 'నారాయణా - బావున్నావా' అంటూ కౌగిలించుకుని, వాడి జేబులో పది రూపాయలనోటు తోసి, కుడి చేత్తో వాడి

మెడ పట్టుకుని గెంటుకుంటూ హోటలుకి తీసికెళ్ళి, కుడితి తొట్టెలో ముంచినట్లు సాంబారు ప్లేటులో వాణ్ణి ముంచి తీశాకా, 'ఈయన నోరు మెదపడే' అన్నాడు హనుమాన్లును చూపించి.

'వాడికిల్లాంటి విషయాల్లో అనుభవం లేదులే' అని, ఆఫీసులో అడుగు పెడుతూనే అందరికీ పెసరట్టు, ఉప్మా, స్వీటు తీసుకురమ్మని అందరికీ వినబడేలా నారాయణకి చెప్పి, అప్లికేషను ఫారానికి వంద రూపాయల నోటు పిన్నుతో గుచ్చి సూపర్నెంటుగారికి అందించాను, నవ్వుతూ.

నా వెనకాలే నీడలా వెర్రిమొహం వేసుకు తిరుగుతున్న హనుమాన్లుని వాళ్ళందరూ చూశారు కాని పాత విషయాలేవీ గుర్తులేనట్లు ప్రవర్తించారు.

ఏభై రూపాయలనోటు తగిలించి అప్లికేషను వ్యాఘ్రేశ్వరుడికి అందిస్తూ 'నారాయణా! మన వ్యాఘ్రం గారికి స్పెషల్ కోడి పలావు తీసుకురా' అని పురమాయించాను.

'మీరెందుకు సార్ – నేనున్నాను కదా' అని నారాయణ కాళ్ళకు అడ్డంపడుతుంటే, 'నువ్వొక్కడివీ ఏం కష్టపడతావు నారాయణా' అని వాడికి సానుభూతి చూపించి, వ్యాఘ్రం అందించిన ఫైలు తీసుకుని ఆఫీసరుగారికి నమస్కారం చేసి అందించాను.

ఆయన నన్నోసారి చూసి, ఫైలు పైకీ కిందికీ చూసి, సంతకం పెడుతూ 'సూపర్నెంటుగారు అన్నీ సరిగా చూశారా' అనడిగారు.

'ఈసారి అంతా ఓకే సార్' అన్నాను ఫైలు అందుకుంటూ.

రెండు ఆఫీసుల్లోనూ పని చకచకా అయిపోయింది.

'థాంక్స్ గురూ – నీ వల్ల గట్టెక్కాను. లెంపలేసుకుంటున్నాను – ఇంక జన్మలో ఏ ఆఫీసులోనూ అడుగు పెట్టను' అన్నాడు హనుమాన్లు ఆఫీసులోంచి బయటికి వస్తూంటే.

'గవర్నమెంటాఫీసులో అడుగు పెట్టకుండా పనులెలా అవుతాయి?'

'నీలాంటి వాళ్ళ కాళ్ళు పట్టుకుంటాను కాని.... అమ్మ తోడు... ఇంక ఆఫీసులో...' అంటూ హనుమాన్లు అంటుంటే గేటు దగ్గర పడుకున్న కుక్క వాణ్ణి చూసి, 'భౌ... భౌ...' అంటూ అరిచింది. హనుమాన్లు 'ఫో... ఫో....' అని కొట్టబోయాడు. అది మీదికి దూకి కరవబోయింది. నేను దానికి అడ్డంపడి, 'దూ... దూ...' అంటూ

చెయ్యి చాపాను. కుక్క హనుమాన్లుని వదిలేసి తోక ఊపుతూ కాళ్ళకడ్డం పడుతూ నా వెంట రాసాగింది.

'నువ్వు రాకపోతే ఈ పనయ్యేది కాదు' అన్నాడు హనుమాన్లు మళ్ళీ.

'నువ్వు చేసిన తప్పేవిటో నీకు తెల్సిందా?'

'నేను తప్పు చెయ్యడవేవిటి? నేనేం చేశాను?'-హనుమాన్లు తెల్లబోతూ అడిగాడు.

వీడీ జన్మకి బాగుపడడని నాకు అర్థమైపోయింది. నేను నవ్వి 'గుడ్ బై' అని కదిలాను.

హనుమాన్లు కేసి ఓ సారి నిరసనగా చూసి నా వెంటపడింది కుక్క.

*(ఆంధ్రజ్యోతి ఆదివారం 12 సెప్టెంబర్, 1999)*